సాక్షి
ఖమ్మం

మంగళవారం । 6 । మే । 2025



ఫిర్యాదులు పెండింగ్‌లో ఉండొద్దు

గ్రీవెన్స్ డేలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పరిష్కరించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి సూచించారు.

8లో



అప్రమత్తంగా లేకపోతే ముప్పే

గ్యాస్ వినియోగం విషయంలో అప్రమత్తంగా లేకపోతే ప్రమాదాలు ఎదురవుతాయని అధికారులు సూచిస్తున్నారు.

8లో



వాతావరణం

జిల్లాలో మంగళవారం గరిష్టస్థాయిలో ఉష్ణోగ్రత నమోదవుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత, వడగాలుల ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10గంటలకు కూసుమంచి మండలం నేలపట్ల, మల్లేపల్లి, జక్కేపల్లి ఎస్సీకాలనీ, పాలేరులలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. మధ్యాహ్నం 12గంటలకు ఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగే నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ సమావేశంలో పాల్గొంటారు. అతర్వాత సాయంత్రం 4గంటలకు ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు, పెద్దతండా, గొల్లపాడు, కరుణగిరిలో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి, మెయిన్ రోడ్డుపై ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు, మారెమ్మ ఆలయం – కేంద్రియ విద్యాలయం రోడ్డుపై వీధి దీపాల ఏర్పాటుకు మంత్రి శంకుస్థాపన చేయనున్నారు.

‘భూ భారతి’ సదస్సులు సద్వినియోగం చేసుకోండి



దరఖాస్తులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

బోనకల్: భూసమస్యల పరిష్కారానికి రాష్ట్రప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన భూ భారతిపై నిర్వహిస్తున్న అవగాహన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి సూచించారు. జిల్లాలో రెండో విడతగా బోనకల్ మండలాన్ని ఎంపిక చేయగా, తొలిరోజు మండలంలోని గార్లపాడులో సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆర్‌డీఓ జి.నరసింహారావు మాట్లాడుతూ భూభారతి చట్టంపై అవగాహన కల్పిస్తూ దరఖాస్తుల స్వీకరణకు సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా, గ్రామంలో భూసమస్యలకు సంబంధించి 67 దరఖాస్తులు అందగా, కేటగిరీల వారీగా పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు. తహసీల్దార్ పున్నంచందర్, ఆర్‌ఐలు నవీన్, మైథిలి, ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరావు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రారంభమైన స్పాట్ వాల్యూయేషన్

ఖమ్మం సహకారనగర్: ఓపెన్ స్కూల్ పదో తరగతి జవాబుపత్రాల మూల్యాంకనం సోమవారం ప్రారంభమైంది. ఖమ్మంలోని రోటరీనగర్ పాఠశాలలో ఏర్పాటుచేసిన క్యాంప్‌నకు డీఈఓ సామినేని సత్యనారాయణ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం క్యాంప్‌ను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ పదో తరగతి జవాబుపత్రాల మూల్యాంకనం మొదలుకాగా, ఇంటర్ మూల్యాంకనం ఈనెల 8న ప్రారంభమవుతుందని తెలిపారు. జిల్లాకు 18,999 ఇంటర్మీడియట్ జవాబుపత్రాలు, 11,118 పదో తరగతి జవాబు పత్రాలు వచ్చాయని చెప్పారు. ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు పాల్గొన్నారు.

ముత్తంగి అలంకరణలో భద్రాద్రి రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారు సోమవారం ముత్తంగి అలంకరణలో దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. స్వామికి కంకణ ధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఎల్‌ఆర్‌ఎస్.. ఆదాయం ఫుల్!

ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్ డెస్క్ వద్ద వివరాలు ఆరా తీస్తున్న కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య



ఎల్‌ఆర్‌ఎస్ పథకానికి సంబంధించి ఫీజు చెల్లింపునకు ప్రభుత్వం రాయితీ ప్రకటించగా ఖమ్మం కార్పొరేషన్‌తోపాటు జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలకు మెరుగైన ఆదాయం నమోదైంది. ఈనెల 3తో రాయితీ గడువు ముగిసే నాటికి ప్రభుత్వానికి రూ.96.79 కోట్ల ఆదాయం సమకూరింది. అయితే రాయితీ గడువు మరోసారి పెంచుతారా అని దరఖాస్తుదారులు ఆరా తీస్తున్నారు. మరోవైపు నిషేధిత భూముల జాబితాకు పరిష్కారం చూపి, గడువు పొడిగిస్తే మరింత ఆదాయం వస్తుందని చెబుతున్నారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

రాయితీ గడువు ముగిసే నాటికి రూ.96.79కోట్ల రాబడి

- మొత్తంగా 25,745 దరఖాస్తులకు ఫీజు చెల్లింపు
- గడువు పెంచితే మరింత ఆదాయానికి అవకాశం

25వేలకు పైగా దరఖాస్తులు

జిల్లాలో ఖమ్మం కార్పొరేషన్, సత్తుపల్లి, మధిర, వైరా, ఏదులాపురం మున్సిపాలిటీలు, సుడా, గ్రామపంచాయతీల పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం 1,00,453 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 80,456 దరఖాస్తులు ఫీజు చెల్లింపునకు సక్రమంగా ఉన్నట్లు అధికారులు నిర్ధారించి యజమానులకు సమాచారం ఇచ్చారు. ఇంతలోనే ప్రభుత్వం 25 శాతం రాయితీ ప్రకటించడంతో 25,745 దరఖాస్తులకు గాను ఫీజు చెల్లించగా జిల్లా నుంచి రూ.96.79 కోట్లు వసూలయ్యాయి.

మరోసారి పెంచుతారా..

ఎల్‌ఆర్‌ఎస్ రాయితీ ఫీజు గడువు ముగిసినప్పటికీ అర్హత ఉన్న దరఖాస్తుదారులు ఫీజు చెల్లించలేదు. మొత్తం 80,456 మందిలో 25,745 మందే చెల్లించగా, మిగతా వారు వివిధ కారణాలతో దూరమయ్యారు. ప్రస్తుతం వారు మున్సిపాలిటీలు, కార్పొరేషన్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. రాయితీ గడువు 3వ తేదీనే ముగిసినా సోమవారం పలువురు కేఎంసీ కార్యాలయానికి వచ్చి రాయితీ గడువు మరోసారి పెంచుతారా అని ఆరా తీశారు.

ఈ సమస్యకు పరిష్కారమెలా..

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులను ప్రొహిబిటెడ్ సమస్య వేధిస్తోంది. పలువురి భూములను నిషేధిత జాబితాలో చేర్చడంతో వేలాది మంది ఫీజు చెల్లింపునకు అర్హత సాధించలేదు. ఖమ్మం కార్పొరేషన్, సత్తుపల్లి, మధిర, వైరా, ఏదులాపురం మున్సిపాలిటీల్లో 5,685 దరఖాస్తులు, సుడా పరిధిలో 682 దరఖాస్తులు ఈజాబితాలో ఉన్నాయి. క్షేత్రస్థాయిలో రెవెన్యూ, ఇరిగేషన్, టౌన్ ప్లానింగ్ అధికారులు పరిశీలించాకే నిషేధిత భూమా, కాదా అన్నది తేలనుంది. అయితే, ఈనెల 3వ తేదీ వరకు ఫీజు కట్టించుకోవడంలో నిమగ్నమైన అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించలేదు. దీంతో తాము రాయితీ అవకాశం కోల్పోయినందున.. ఇప్పటికైనా సమస్యకు పరిష్కారం చూపాలని యజమానులు కోరుతున్నారు.

కేఎంసీకి మూడో స్థానం

25 శాతం ఫీజు రాయితీతో ఎల్‌ఆర్‌ఎస్ పన్ను చెల్లింపుల్లో ఖమ్మం కార్పొరేషన్ రాష్ట్రంలో మూడో స్థానాన నిలిచింది. మొదటి స్థానంలో గ్రేటర్ వరంగల్, రెండో స్థానంలో పెద్ద అంబర్‌పేట ఉన్నాయి. కేఎంసీ పరిధిలో 40,181 దరఖాస్తులు రాగా.. 29,322 మందికి ఫీజు చెల్లించాలని సమాచారం ఇచ్చారు. ఇందులో 11,999 మంది ఫీజు చెల్లించగా, కేఎంసీకి రూ.54.58 కోట్ల ఆదాయం సమకూరింది. జిల్లాలో వచ్చిన ఆదాయం సగానికి పైగా కేఎంసీ నుంచే నమోదు కావడం విశేషం. రాయితీ సమాచారం యాజమానులకు చేరవేయడం, గడువులోగా ఫీజు చెల్లించేలా అధికారులు పర్యవేక్షించడంతో ఫలితం దక్కిందని భావిస్తున్నారు. ఇక సుడా పరిధిలో 19,245 మందికి సమాచారం ఇవ్వగా, 5,825 మంది రూ.15.38 కోట్ల మేర చెల్లించారు.



ఎల్‌ఆర్‌ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులు, ఫీజు చెల్లింపు, ఆదాయం వివరాలు

పేరు	దరఖాస్తులు	ఫీజు చెల్లించింది	ఆదాయం (రూ.కోట్లలో)
ఖమ్మం కార్పొరేషన్	40,181	11,999	రూ.54.58
సత్తుపల్లి	3,696	634	రూ.3.00
మధిర	4,306	1,024	రూ.4.56
ఏదులాపురం	13,611	3,550	రూ.12.40
వైరా	3,535	707	రూ.2.25
సుడా	20,747	5,825	రూ.15.38
జీపీలు	14,378	2,006	రూ.4.62
మొత్తం	1,00,453	25,745	రూ.96.79

ప్రతీ రైతుకు గుర్తింపు

- 11 అంకెలతో ‘ఫార్మర్ ఐడీ’ కేటాయింపు
- రిజిస్ట్రేషన్లు ప్రారంభించిన వ్యవసాయ శాఖ
- భూమి, పంటల వివరాలు నమోదు చేస్తున్న ఏఈఓలు

ఖమ్మంవ్యవసాయం: వ్యవసాయ రంగాన్ని డిజిటలైజేషన్ చేయడమే లక్ష్యంగా కేంద్రప్రభుత్వం రూపొందించిన ‘ఫార్మర్ ఐడీ’ ప్రాజెక్టుకు జిల్లాలో సోమవారం శ్రీకారం చుట్టారు. ఈ ప్రక్రియలో ప్రతీ రైతుకు 11 అంకెలతో కూడిన గుర్తింపు నంబర్ కేటాయిస్తారు. రైతులకు ఉన్న భూమి రకం, విస్తీర్ణం, సర్వేనంబర్, పట్టాదార్ పాస్ పుస్తకం నంబర్, పంటల సాగు వివరాలు, వ్యక్తిగత వివరాలను నమోదు చేయనుండగా.. ఇప్పటికే వ్యవసాయ విస్తరణాధికారుల(ఏఈఓ)కు శిక్షణ ఇచ్చారు. దీంతో వారు క్లస్టర్ల వారీగా వివరాల నమోదును ప్రారంభించారు. ఫార్మర్ ఐడీని ఆధార్ కార్డుతో లింక్ చేయనుండగా.. ఒక క్లిక్‌తో సమస్త సమాచారం అందుబాటులోకి వస్తుంది.

కేంద్ర పథకాల కోసమే..

కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాల అమలు కోసం ఫార్మర్ ఐడీని రూపొందించారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ యోజన, సాయిల్ హెల్త్ కార్డు, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, భారత ఆహార భద్రత మిషన్, రాష్ట్రీయ కృషి వికాస యోజన వంటి పథకాల అమలులో ఈ నంబర్ కీలకం కానుంది. కేంద్ర పథకాలను పారదర్శకంగా అర్హుల దరిచేర్చడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టు అమలు చేస్తున్నారు. ప్రతీసారి రైతు భూమి పత్రాలన్నీ తీసుకెళ్లే అవసరం లేకుండా ఈ నంబర్‌తో అధికారులు తెలుసుకునే వీలవుతుంది. అయితే, రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, రైతు బీమా తదితర పథకాలకు దీంతో సంబంధం ఉండదని అధికారులు చెబుతున్నారు.

నెల పాటు రిజిస్ట్రేషన్లు

ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నెల పాటు జరుగుతుంది. సోమవారం మొదలుకాగా, జూన్ 5వ తేదీ నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. జిల్లాలోని 129 క్లస్టర్లలో ఏఈఓలు ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. అయితే, ఏఈఓలు వచ్చినప్పుడు అందుబాటులో లేని రైతులు ఆధార్, పట్టాదార్ పాస్ పుస్తకం వంటి వివరాలతో సమీపంలోని మీ సేవా కేంద్రంలోనూ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. జిల్లాలో 3.51 లక్షల మంది రైతుల ఫార్మర్ ఐడీ జారీ చేయాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ చేసుకున్న ఒక్క రోజు వ్యవధిలోనే ఓటీపీ విధానం ద్వారా ఫార్మర్ ఐడీ వస్తుంది.



వివరాల నమోదును పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య

రైతులందరికీ నంబర్

రఘునాథపాలెం: కేంద్రప్రభుత్వం చేపట్టిన ‘ఫార్మర్ ఐడీ’ ప్రాజెక్టులో భాగంగా ప్రతీ రైతుకు 11 అంకెలతో కూడిన ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి.పుల్లయ్య తెలిపారు. రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంలో రైతుల వివరాల నమోదును సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీఏఓ పరిశీలించారు. ఏఈఓ బాలాబత్తుల శిరణ్మయి, రైతులు పాల్గొన్నారు.

గుర్తింపు తప్పనిసరి



కేంద్రప్రభుత్వ పథకాలు పొందేందుకు ఫార్మర్ ఐడీ తప్పనిసరి. రైతులు స్వచ్ఛందంగా ఏఈఓలను సంప్రదించి పట్టాదారు పాస్ పుస్తకం తదితర వివరాలు అందిస్తే రిజిస్ట్రేషన్ చేస్తారు. ఏఈఓల ద్వారా లేదా సమీపంలోని మీ సేవా కేంద్రాల్లోనూ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

– ధనసరి పుల్లయ్య, జిల్లా వ్యవసాయాధికారి

కేంద్ర మంత్రి గడ్కరీని కలిసిన తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని సోమవారం బేగంపేట ఎయిర్‌పోర్టులో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలిశారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా మీదుగా వెళ్తున్న జాతీయ రహదారుల పనులపై చర్చించారు. ధంసలాపురం నుండి కలెక్టరేట్ వరకు ఇరువైపులా సరీస్ రోడ్లు మంజూరు చేయాలని ఆయన కోరారు. అలాగే, జగ్గయ్యపేట నుండి కొత్తగూడెం వయా వైరా వరకు నూతన జాతీయ రహదారి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాక ఖమ్మం – కురవి, అమరావతి – నాగపూర్ హైవేకు రింగ్‌రోడ్డు ఏర్పాటు చేయాలని కోరగా, కేంద్ర మంత్రి గడ్కరీ సానుకూలంగా స్పందించారని మంత్రి తుమ్మల వెల్లడించారు.

ఎఫ్‌పీఓలుగా సొసైటీలు

- జిల్లాలో నాలుగు పీఏసీఎస్‌లకు అవకాశం
- రూ.15 లక్షల చొప్పున నిధులతో విస్తరించనున్న సహకార సేవలు

నేలకొండపల్లి: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(పీఏసీఎస్)లను రైతు ఉత్పత్తిదారుల సంస్థలు(ఎఫ్‌పీఓ)గా అప్‌గ్రేడ్ చేస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లాలో తొలి విడత నాలుగు సొసైటీలకు అవకాశం దక్కింది. ఈమేరకు జాతీయ సహకార అభివృద్ధి సంస్థ(ఎన్‌సీడీసీ)తో అవగాహన మేరకు సహకార శాఖ ప్రక్రియ నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా నాలుగు సొసైటీలను అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

76 సంఘాల్లో కార్యకలాపాలు

జిల్లాలో 76 పీఏసీఎస్‌లు ఉండగా, ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు, వాహన, పంట రుణాల పంపిణీ తదితర సేవలందిస్తున్నాయి. ఇందులో మెరుగైన లావాదేవీలు జరుగుతున్న నాలుగు సొసైటీలను తొలి దశలో ఎఫ్‌పీఓలుగా మార్చారు. ఇందులో బోదులబండ (నేలకొండపలి), కారేపల్లి, ఏదులాపురం, గంగదేవిపాడు పీఏసీఎస్‌లను ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్లుగా అప్‌గ్రేడ్ చేశారు. ఇంకొన్నింటిని రెండో విడతలో ఎఫ్‌పీఓలుగా మార్చే అవకాశముంది. తద్వారా సహకార ఫలాలు మరింతగా విస్తరించనున్నాయి.

నిధులు ఇలా.....

రైతుల ఆదాయం పెంపే లక్ష్యంగా కేంద్రప్రభుత్వం పీఏసీఎస్‌లను ఎఫ్‌పీఓలుగా మార్చి కార్యకలాపాలు విస్తరించనుంది. సాగులో నూతనంగా వస్తున్న సాంకేతికతను సన్న, చిన్న కారు రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చి వారి ఆదాయం పెంచాలనే లక్ష్యంతో ఈ పథకం అమలు చేస్తోంది. ఎఫ్‌పీఓల్లో సభ్యులకు రూ.15 లక్షల చొప్పున మ్యాచింగ్ గ్రాంట్ కేటాయిస్తారు. అలాగే, ఎఫ్‌పీఓల పూర్తి స్థాయి కార్యకలాపాల కోసం మూడేళ్ల పాటు మరి కొంత నిధులు విడుదల చేస్తారు. ఉద్యోగుల వేతనాలు సైతం ఈ నిధుల నుంచి తీసుకునే అవకాశముండగా, కంప్యూటర్, ఇతరత్రా అవసరాలకు కూడా వాడుకోవచ్చు.



బోదులబండ సొసైటీ కార్యాలయం

నిధులకు ప్రతిపాదనలు

జిల్లాలో నాలుగు పీఏసీఎస్‌లను ఎఫ్‌పీఓలుగా ఎంపిక చేశారు. ఈ సొసైటీల్లో ఇప్పటికే ఖాతాలు కూడా ప్రారంభమయ్యాయి. నిధులు మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించాం. తద్వారా వ్యాపార సంస్థలుగా ఆవిర్భవించినట్లవుతుంది. త్వరలోనే రైతులను ఐక్యం చేసి కార్యకలాపాలు మొదలుపెట్టేలా ప్రణాళిక రూపొందించాం.

– గంగాధర్, జిల్లా సహకార శాఖ అధికారి

శాస్త్రవేత్తల సూచనలతో అధిక దిగుబడి

- విత్తన ఎంపిక, సస్యరక్షణ చర్యల్లో అప్రమత్తత
- ‘రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు’లో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

రఘునాథపాలెం: రైతులు పంటల సాగులో శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తే మేలైన దిగుబడి సాధ్యమవుతుందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. వానాకాలం పంటల సాగుపై అవగాహన కల్పించేలా ‘రైతు ముంగిట శాస్త్రవేత్తలు’ పేరిట నిర్వహిస్తున్న కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈసందర్భంగా రఘునాథపాలెం మండలం రాంక్యాతండా రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటల గుర్తింపు, మేలైన విత్తనాల ఎంపిక, సస్యరక్షణ చర్యల్లో అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని తెలిపారు. అంతేకాక పంట మార్పిడి, ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య మాట్లాడుతూ విత్తనాలు, పురుగు మందుల రశీదులు పంట పూర్తయ్యేలా భద్రం చేయాలని సూచించారు. వైరా కేవీకే కోఆర్డినేటర్ రవికుమార్ మాట్లాడుతూ యూరియా వాడకం, నేల ఆరోగ్యం పరిరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. రఘునాథపాలెం, మంచుకొండ సొసైటీల అధ్యక్షులు తాతా రఘురాం, మందడపు సుధాకర్, ఖమ్మం డివిజన్ ఆత్మ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, ఏడీఏ కొంగర వెంకటేశ్వరరావు మాట్లాడగా ఎంపీడీఓ అశోక్ కుమార్, మండల వ్యవసాయ అధికారి ఉమామహేశ్వర్‌రెడ్డి, ఉద్యానవనాధికారి నగేష్, ఏఈఓలు ప్రతిభ, వేదవ్యాస్, శివ, వెంకటేష్, శిరణ్మయి, పంచాయతీ సెక్రటరీ లాలయ్యతో పాటు నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కొత్త పంటల సాగులో ప్రతిభ కనబరుస్తున్న పలువురు రైతులను కలెక్టర్ సన్మానించారు.



రైతును సన్మానిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

జీవితంలో గొప్పగా ఎదగాలి

ఖమ్మంవన్‌టౌన్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవడమే కాక వాటి సాధనకు కృషి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. జిల్లా కేంద్రంలోని బాలల సదనాన్ని సందర్శించిన ఆయన పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన వారిని అభినందించారు. అందుబాటులో ఉన్న అవకాశాలను సమర్థవంతంగా వినియోగించుకుంటే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. అనంతరం బాలల సదనంలో ఆధునీకీకరణ పనులపై అధికారులకు సూచనలు చేశారు. జిల్లా సంక్షేమాధికారి కేసర రాంగోపాల్‌రెడ్డి, ఉద్యోగులు కృష్ణలాల్, విద్యాచందన పాల్గొన్నారు.

మంత్రుల పర్యటనకు ఏర్పాట్లు

ఖమ్మంఅర్బన్: త్వరలో జరగనున్న మెడికల్ కాలేజీ భవనాల శంకుస్థాపనకు పలువురు మంత్రులు హాజరుకానున్నందున, పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. రఘునాథపాలెం వద్ద మెడికల్ కాలేజీకి కేటాయించిన భూములను పరిశీలించి శంకుస్థాపన ఏర్పాట్లపై సూచనలు చేశారు. మంత్రులు తమ పర్యటనలో భాగంగా శంకుస్థాపన చేయడంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శిస్తారని, కలెక్టరేట్‌లో సమీక్షించనున్నందున వివరాలతో అధికారులు సిద్ధం కావాలన్నారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ, ఈఈ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 21 వరకు ‘దోస్త్’ రిజిస్ట్రేషన్లు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ జాకీరుల్లా, అధ్యాపకులు

ఖమ్మం సహకారనగర్: డిగ్రీలో ప్రవేశాలకు ‘డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్)’ తొలిదశ షెడ్యూల్ విడుదలైందని ఖమ్మంలోని ఎస్‌ఆర్ బీజీఎన్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ జాకీరుల్లా తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన కళాశాలలో ప్రచార పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 21 వరకు తొలి విడత రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగనుండగా, 10నుంచి 22 తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వొచ్చని తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం హాల్ టికెట్, ఆధార్ కార్డు జిరాక్స్, ఆధార్ కార్డుకు లింక్ అయిన ఫోన్ నంబర్, ఎస్సెస్సీ, ఇంటర్ మెమోలు, 6–10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్ల జిరాక్సులు, ఇంటర్ టీసీ, రెండు ఫొటోలతో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని వెల్లడించారు. ఇందుకోసం తమ కళాశాలలోని సహాయ కేంద్రంతో పాటు 98498 41555, 96188 96949 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు ఏ.ఎల్.ఎన్ శాస్త్రి, బానోత్ రెడ్డి, దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ సలీం పాషా, వివిధ విభాగాల బాధ్యులు సునంద, డాక్టర్ రమాసత్యవతి, ఈ.వేలాద్రి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన అన్నదాతలు

మిల్లుల కేటాయింపులో కొర్రీలపై ఆగ్రహం

కొణిజర్ల: ధాన్యాన్ని ఫలానా మిల్లుకు తీసుకెళ్లాలని సూచించి, ఆతర్వాత మరో మిల్లుకు తరలించాలని చెప్పడంతో సివిల్ సప్లయిస్ అధికారుల తీరుపై ఆగ్రహిస్తూ రైతులు రాస్తారోకో చేపట్టారు. కొణిజర్ల మండలంలోని పలు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని మండల కేంద్రంలోని శ్రీ శ్రీనివాస మిల్లుకు తరలిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం శనివారం ట్రాక్టర్లలో రైతులు వెళ్లగా అక్కడే నిలిపేశారు. తీరా సోమవారం మధ్యాహ్నం డీఎస్‌ఓ చందన్‌కుమార్ వచ్చి మిల్లు కోటా పూర్తయిందని వైరాలోని మిల్లుతో పాటు హనుమకొండ జిల్లా కేంద్రానికి తరలించాలని సూచించారు. అయితే, మూడు రోజుల పాటు వేచి ఉన్నాక ఇతర చోట్లకు వెళ్లాలనడంతో రైతులు వైరా – సత్తుపల్లి జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. వీరికి సీపీఎం, మాస్‌లైన్ నాయకులు బొంతు రాంబాబు, సీ.వై.పుల్లయ్య, కంకణాల అర్జునరావు మద్దతు తెలపగా, ఆందోళనతో ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. దీంతో ఎస్‌ఐ జి.సూరజ్, తహసీల్దార్ రాము, ఆర్‌ఐలు రమేష్, అశోక్ చేరుకుని రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం మిల్లు వద్ద ట్రాక్టర్ల నుంచి ధాన్యం దిగుమతి చేయించాలని, ఆతర్వాత ఇతర చోట్లకు పంపాలని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

తరుగు తీస్తున్నారని...

కల్లూరు: ధాన్యం తరుగు పేరిట మిల్లర్లు వ్యవహరిస్తున్న తీరుపై కల్లూరులో రైతులు రాస్తారోకోకు దిగారు. పుల్లయ్యబంజర్‌కు చెందిన రైతులు ఐకేపీ కేంద్రానికి ధాన్యం తీసుకురాగా, మిల్లర్లు క్వింటాకు రెండు కేజీల తరుగు తీస్తామని చెప్పారు. దీనికి రైతులు అంగీకరించినా చివరకు 4–5 కేజీల తరుగు తీస్తుండడంతో తహసీల్‌లో వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లారు. అక్కడ తహసీల్దార్ లేకపోవడంతో ఆందోళనకు దిగారు. దీంతో వాహనాలు నిలిచిపోగా ఎస్‌ఐ డి.హరిత నచ్చచెప్పాక ఆర్‌డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. రైతు బొల్లం నాగరాజు 700 టిక్కీల ధాన్యం తీసుకొస్తే 21 టిక్కీలు కోత పెట్టారని ఆరోపించారు. రైతులు కిష్టంశెట్టి నరసింహారావు, శివలీల కృష్ణ, పసుపులేటి సుబ్బారావు, వంగల శ్రీను, కిష్టంశెట్టి దుర్గ, పెద్దబోయిన వెంకి, మధ్యబోయిన వెంకటేశ్వరరావు, బొల్లం నాగరాజు, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొణిజర్లలో రాస్తారోకోతో నిలిచిపోయిన వాహనాలు

క్లుప్తంగా

నేడు వాహనాల వేలంపాట

ఖమ్మంక్రైం: ఖమ్మం, సత్తుపల్లి ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో గంజాయి, ఇతర మత్తు పదార్థాలు రవాణా చేస్తుండగా స్వాధీనం చేసుకున్న వాహనాలను మంగళవారం వేలం వేయనున్నట్లు ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్–1 సీఐ కృష్ణ తెలిపారు. మొత్తం 18వాహనాలను వేలం వేయనుండగా, ఆసక్తి ఉన్న వారు ఈఎండీ చెల్లించి పాల్గొనాలని సూచించారు. వాహనం పొందిన వారు జీఎస్టీతో సహా నిర్దేశిత ధర చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

సీఎంఆర్ఎఫ్‌తో నిరుపేదలకు ఊరట


చెక్కులు అందుకున్న వారితో నాయకులు

ఖమ్మంవన్‌టౌన్: అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకోలేని పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం(సీఎంఆర్ఎఫ్) ద్వారా ఊరట లభిస్తోందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా ఖమ్మం రూరల్, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో 113 మందికి మంజూరైన రూ.40లక్షల విలువైన చెక్కులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో సోమవారం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు తుంబూరు దయాకర్‌రెడ్డి, మద్దినేని స్వర్ణకుమారి మాట్లాడుతూ మంత్రి పొంగులేటి సిఫారసుతో చెక్కులు మంజూరయ్యాయని తెలిపారు. నాయకులు సురేష్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం పేరుతో మోసం

మహిళపై కేసు నమోదు

కూసుమంచి: ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.3.29 లక్షలు కాజేసిన మహిళపై సోమవారం కూసుమంచి పోలీసులు కేసునమోదు చేశారు. కూసుమంచికి చెందిన దామళ్ల రామచంద్రయ్యను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాంపేడుకు చెందిన గుడిబండ్ల ఆదిలక్ష్మి పరిచయం చేసుకుంది. రామచంద్రయ్య కుమార్తెకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి ఆయన నుంచి విడతల వారీగా రూ.3.29లక్షలు తీసుకుని ముఖం చాటేసింది. దీంతో మోసపోయినట్లు గుర్తించిన ఆయన చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

కానిస్టేబుల్‌కు రియల్ హీరో అవార్డు


సీఎం చేతుల మీదుగా అవార్డు అందుకున్న నరేష్

సత్తుపల్లి: సత్తుపల్లి పోలీసుస్టేషన్‌లోని ఐడీ పార్టీ కానిస్టేబుల్ ఎం.నరేష్‌కు 'రియల్ హీరో' అవార్డు లభించింది. ఓ టీవీ చానల్ ఆధ్వర్యాన ప్రకటించిన అవార్డుకు ఆయన ఎంపిక కాగా, హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా సోమవారం అందుకున్నారు. మార్చి 10వ తేదీన సత్తుపల్లిలో ఓ దొంగను పట్టుకునే క్రమంలో కానిస్టేబుల్ నరేష్‌ను తొమ్మిది చోట్ల కత్తితో పొడిచినా వెనక్కి తగ్గకుండా నిందితుడిని బంధించారు. దీంతో ఆయనను 'రియల్ హీరో' అవార్డు అందించగా, ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, డీజీపీ జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోడుభూములకు సాగునీటి సదుపాయం

రెడ్కో మేనేజర్ అజయ్‌కుమార్

చంద్రుగొండ: గిరిజనుల పోడు భూములకు సాగునీటి సదుపాయం కల్పిస్తామని, ఇందుకోసం చంద్రుగొండ మండలంలోని బెండాలపాడు గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామని రాష్ట్ర ఇంధన వనరుల పునరుద్ధరణీయ సంస్థ(రెడ్కో) ఉమ్మడి జిల్లా మేనేజర్ అజయ్‌కుమార్ తెలిపారు. ఇందిర జల వికాసం పథకం ద్వారా పట్టాలు పొందిన వారి పోడు భూముల్లో వేయనున్న బోరుబావులకు సోమవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ఒక్కో బోరుకు సోలార్ ప్లాంట్‌తోపాటు ఐటీడీఏ ద్వారా రూ.5లక్షలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భోజ్యా నాయక్, బొర్రా సురేష్, ఫజల్ పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	2,100	2,000
పెసలు	6,915	3,000
కందులు	6,400	6,400
మినుములు	6,000	6,000
అలసంద	6,000	6,000
మిర్చి	13,000	6,000
మిర్చి తాలు	5,850	4,800
పత్తి	7,500	5,800

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.20,058

అప్రమత్తంగా లేకపోతే ముప్పే

- గ్యాస్‌తో జాగ్రత్తలు తప్పనిసరి
- వణికిస్తున్న గ్యాస్ సంబంధిత ప్రమాదాలు
- మిట్టపల్లి ఘటనలో నాలుగుకు చేరిన మృతుల సంఖ్య


మంటలు ఆర్పడంపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ ఉద్యోగులు (ఫైల్)

సత్తుపల్లిటౌన్: జిల్లాలో రోజురోజుకు పెరుగుతున్న వంటింటి గ్యాస్ ప్రమాదాలు ప్రజలను వణికిస్తున్నాయి. గ్యాస్ సిలిండర్ లీకేజీతో ఈ ప్రమాదాలు జరుగుతుండగా ఆందోళన వ్యక్తమవుతోంది. ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రాణాల మీదకు వస్తుండడంతో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపక శాఖ అధికారులు సూచిస్తున్నారు. అయితే, గృహ వినియోగదారులకు స్టౌ, రెగ్యులేటర్ తదితర అంశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్యాస్ కంపెనీలు కూడా అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.

జిల్లాలో జరిగిన ప్రమాదాల్లో కొన్ని..

- సత్తుపల్లిలోని హనుమాన్‌నగర్‌కు చెందిన అడపా శ్రీరాంమూర్తి – కుమారి దంపతులు 2023లో జరిగిన గ్యాస్ లీకేజీ ప్రమాదంలో మరణించారు.
- ఎన్టీఆర్‌నగర్‌లోని తడికమళ్ల ప్రకాశరావు నివాసంలో గ్యాస్ లీకేజీతో మంటలు వ్యాపించగా ఆస్తినష్టం సంభవించింది.
- ద్వారకాపురి కాలనీలోని వెంకటేశ్వరరావు నివాసంలో ఆరుబయట వంట చేస్తుండగా గ్యాస్‌లీక్ కావటంతో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో సుమారు 1.50లక్షల ఆస్తి నష్టం జరిగింది.
- సత్తుపల్లి చర్చి రోడ్డులోని బాబీ నివాసంలో వంట చేస్తుండగా గ్యాస్‌పైప్ లీక్ అయి మంటలు అంటుకున్నాయి.
- తల్లాడ మండలం మిట్టపల్లిలో ఇటీవల గ్యాస్ లీక్ అయి మంటలు వ్యాపించిన ఘటనలో ముగ్గురు పిల్లలు సహా ఓ వృద్ధురాలు మృతి చెందారు.

లీకేజీలను గుర్తించడం..

- గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్, బుష్ వద్ద శబ్దం వచ్చినా.. వదులుగా తిరుగుతున్నా నిర్లక్ష్యం చేయొద్దు.
- సిలిండర్ ఇచ్చినప్పుడే గ్యాస్ బాయ్‌తో పరిశీలన చేయించాలి. బరువు, లీకేజీ, సీల్ సరిగా, ఉందా లేదా చూడాలి.
- సిలిండర్‌ను స్టౌవ్‌ను కలిపే ట్యూబ్‌ను నిశితంగా గమనించాలి. వేడివల్ల ట్యూబ్ సాగే గుణం కోల్పోయి పెలుసుబారి పగుళ్ల ఏర్పడతాయి.
- పైపునకు గుండుసూది మొనంత రంధ్రం ఏర్పడినా గంటకు కిలోన్నర గ్యాస్ లీక్ అవుతుంది.సిలిండర్ ఖాళీ కాగానే మూత పెట్టాలి.లేకుంటే దుమ్ముధూళి లోపలకు చేరుతుంది.

ఈ జాగ్రత్తలు కూడా...

గ్యాస్ సిలిండర్ ఎప్పుడూ వెలుతురు ఉన్న ప్రదేశలో నిలువుగానే పెట్టాలి. మండే పదార్థాలకుదూరంగా ఉంచాలి. సిలిండర్‌ను పడుకోబెడితేలీక్ ఏర్పడే అవకాశముంటుంది. స్టౌను సిలిండర్ కంటే ఒక అడుగు ఎత్తులో ఉంచాలి. అలాకాకుండా స్టౌనునేలపై ఉంచి వంట చేయడం ప్రమాదకరం.ఏమాత్రం గ్యాస్ వాసన వచ్చినా తలుపులు, కిటికీలు తెరిచి రెగ్యులేటర్ ఆఫ్ చేయాలి.

అవగాహన అవసరం



గ్యాస్ వినియోగంపై అవగాహన కలిగి ఉండడమే కాక జాగ్రత్తలు పాటించాలి. వంట పూర్తికాగానే రెగ్యులేటర్ బంద్ చేయాలి. ఊరు వెళ్లే సమయాన రెగ్యులేటర్ తొలగించి సిలిండర్‌కు మూత తొడగాలి. గ్యాస్ లీక్ అవుతున్నట్లు గుర్తిస్తే లైట్లు వేయొద్దు. అగ్గిపెట్టె వెలిగించవద్దు. ఒకవేళ మంటలు అంటుకుంటే తడి గోనె సంచి లేదా తడి కాటన్ దుప్పటి సిలిండర్‌పై వేయాలి.

– వై.వెంకటేశ్వరరావు, ఫైర్ ఆఫీసర్, సత్తుపల్లి

మృత్యువుతో పోరాడినా దక్కని ఫలితం


ప్రిన్సీ (ఫైల్)

తల్లాడ: గ్యాస్ సిలిండర్ లీకేజీ అయిన ఘటనలో గాయపడిన బాలిక సోమవారం మృతి చెందింది. దీంతో ఈ ఘటనలో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. తల్లాడ మండలం పాత మిట్టపల్లికి చెందిన గుత్తికొండ వినోద్ ఇంట్లో గతనెల 28న సిలిండర్ మారుస్తుండగా మంటలు చెలరేగిన విషయం విదితమే. ప్రమాదంలో వినోద్‌తో పాటు ఆయన కవల కుమారులు తరుణ్, వరుణ్, నాయనమ్మ సుశీల, ఆయన చెల్లెలి కుమార్తెలు గుంటు ప్రిన్సీ, లింసీ గాయపడ్డారు. రెండు రోజుల వ్యవధిలో తరుణ్, వరుణ్, సుశీల మృతి చెందగా.. ప్రిన్సీ, లింసీ హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇందులో ప్రిన్సీ(9) వారం పాటు మృత్యువుతో పోరాడి మృతి చెందింది. సత్తుపల్లి మండలం రామానగర్‌కు చెందిన ఆమె పాఠశాలకు వేసవి సెలవులు ఇవ్వడంతో మేనమామ వినోద్ ఇంటికి వచ్చింది. ప్రమాదంలో నలుగురి మృతితో రెండు కుటుంబాల్లో విషాదం నెలకొనగా, ప్రిన్సీ సోదరి లింసీ హైదరాబాద్, వినోద్ ఇంటి వద్దే చికిత్స పొందుతున్నాడు. కాగా, బాలిక మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం స్వగ్రామానికి తరలిస్తామని తల్లాడ ఎస్‌ఐ బి.కొండల్‌రావు తెలిపారు.

విలువైన సొత్తు.. చోరీకి అదును

- ఖమ్మం కేబుల్ బ్రిడ్జి సామగ్రిపై దొంగల కన్ను
- ఇటీవల అడ్డొచ్చిన సెక్యూరిటీ గార్డుపై దాడి


దొంగల దాడిలో గాయపడిన అశుతోష్


చోరీ జరిగిన బ్రిడ్జి నిర్మాణ ప్రాంతం

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని కాల్వొడ్డులో మున్నేటిపై కేబుల్ బ్రిడ్జి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇందుకోసం నిర్మాణ సంస్థ సమకూర్చుకున్న సామగ్రిపై దొంగల కన్ను పడింది. ఈ ప్రాంతంలో విలువైన సామగ్రి తరచుగా చోరీ అవుతుండడంతో నిర్మాణ సంస్థ ప్రతినిధులు, సెక్యూరిటీ సిబ్బందికి తలనొప్పిగా మారింది. వర్షాలు వస్తే మున్నేటిలో వరద పెరిగి నిర్మాణ పనులకు ఆటంకం ఏర్పడుతుందనే భావనతో ఇటీవల భారీగా సామగ్రిని సమకూర్చుకుని పనుల్లో వేగం పెంచారు. ఈ ప్రాంతంలో పలువురు సెక్యూరిటీ గార్డులను నియమించినా, వారి కళ్లుగప్పుతున్న కొందరు చోరీ చేస్తున్నారు. అయితే, ఇక్కడ సామగ్రి చోరీపై ఖమ్మం త్రీటౌన్, రూరల్ పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు సైతం చేశారు. దీంతో అనుమానితులను పట్టుకుని విచారించగా సమీప ప్రాంతానికి చెందిన అకతాయిలుగా గుర్తించినట్లు సమాచారం. అయితే, కేసు నమోదు చేయకుండా వారి తరఫున కొందరు ప్రజాప్రతినిధులు ఒత్తిడి తెస్తుండడంతో చోరీలు సర్వసాధారణమయ్యాయి.

సెక్యూరిటీ గార్డ్‌పై కత్తులతో దాడి...

ఇదిలా ఉండగా గతవారం చోరీ వచ్చిన కొందరు వ్యక్తులు అక్కడ విధుల్లో ఉన్న సెక్యూరిటీ గార్డుపై కత్తులతో దాడి చేశారు. నిర్మాణ ప్రాంతం నుంచి విలువైన సామగ్రిని ఎత్తుకెళ్తుండగా బిహార్‌కు చెందిన సెక్యూరిటీ గార్డు అశుతోష్‌కుమార్ రాయ్ అడ్డుకున్నాడు. దీంతో ఆయనపై కత్తులతో దాడి చేసిన వారు, తమ వెంట పడకుండా తొడపై తీవ్రగాయం చేశారు. ఈ సమయాన అశుతోష్ కేకలు వేయగా మిగతా సిబ్బంది వచ్చే సరికి పారిపోయారు. దీంతో క్షతగాత్రుడిని సూపర్‌వైజర్ కోటి జిల్లా ఆస్పత్రిలో చేర్పించడమే కాక త్రీటౌన్‌పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యా దు చేశారు. ఓపక్క వర్షాలు వచ్చేలోగా ఎక్కువ శా తం పనులు పూర్తిచేయాలనే లక్ష్యంతో నిర్మాణ సంస్థ ప్రతినిధులు ఉండగా.. వరుస చోరీలతో ఎటూ పాలుపోలేని పరిస్థితి ఎదురవుతోందని వాపోతున్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే ప్రజాపాలన


సన్న బియ్యంతో భోజనం చేస్తున్న రాయల నాగేశ్వరరావు, నాయకులు

నేలకొండపల్లి: బీఆర్ఎస్ హయాంలో పదేళ్ల పాటు అసమర్థ పాలన కొనసాగితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తున్నామని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని కోరట్లగూడెంలో కాంగ్రెస్ సేవాదళ్ నియోజకవర్గ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు నివాసంలో పలువురు నాయకులతో కలిసి సోమవారం సన్న బియ్యంతో భోజనం చేశారు. అలాగే, నాగేశ్వరరావు జన్మదిన వేడుకల సందర్భంగా కట్ చేసిన ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, కేంద్రం సహకరించుకునా కాంగ్రెస్ ఎన్నికల వేళ ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తుందని తెలిపారు. గత పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, ఇప్పుడు కొత్త కార్డులు మంజూరు చేస్తూనే సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. అనంతరం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ఆరోపణలను పార్టీశ్రేణులు తిప్పికొట్టాలని కోరారు. మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, నాయకులు శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, జెర్రిపోతుల అంజిని, యడవల్లి నాగరాజు, హన్మంతరావు, జెర్రిపోతుల సత్యనారాయణ, మార్తి కోటి, గట్టిగుండ్ల విజయ్, కడియాల నరేష్, కణతాల లీలావతి తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా జహంగీర్ అలీ


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు జహంగీర్ అలీ

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎం.డీ.జహంగీర్ అలీ ఎన్నికయ్యారు. ఖమ్మంలో ఆదివారం నిర్వహించిన ఎన్నికలకు ఎన్నికల అధికారిగా అసిస్టెంట్ రిజిస్ట్రార్ హిలావత్ అంజియా వ్యవహరించారు. నల్లగొండ జిల్లాకు చెందిన ఎం.డీ. జహంగీర్ అలీ, సంగారెడ్డి జిల్లాకు చెందిన మల్లేష్ గౌడ్, ఖమ్మం నుంచి కె.వెంకటేశ్వర్లు అధ్యక్ష స్థానానికి నామినేషన్లు దాఖలు చేశారు. చివరకు వెంకటేశ్వర్లు, మల్లేష్ నామినేషన్లు ఉపసంహరించుకోగా... జహంగీర్ అలీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవమైనట్లు ప్రకటించారు. కాగా, సోమవారం ఖమ్మంలోని డ్రైవర్లసంఘం భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘాన్ని బలోపేతం చేయడంతో పాటు సంఘంలో గతంలో జరిగిన అవకతవకలపై పూర్తిస్థాయిలో విచారణ జరపనున్నట్లు తెలిపారు. ఇంకా ఈసమావేశంలో ఎం.డీ.సలీం, దాసరి వేణు, లింగంపల్లి గగన్న, జి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాస్పత్రిని తనిఖీ చేసిన కలెక్టర్



క్యాంటీన్ నిర్వాహకులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి ఆస్పత్రికి వచ్చిన ఆయన వివిధ విభాగాలను పరిశీలించి వాహనాల పార్కింగ్, ఆస్పత్రి ప్రధాన గేట్ బయట రద్దీ నియంత్రణపై చర్చించారు. అనంతరం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఆస్పత్రిలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా అన్ని రకాల చర్యలు చేపట్టాలని సూచించారు. మంత్రుల పర్యటన నాటికి ఆస్పత్రిలో కావాల్సిన వైద్య పరికరాలు, సౌకర్యాలపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆతర్వాత పార్కింగ్, పారిశుద్ధ్య నిర్వహణ, సూచిక బోర్డుల ఏర్పాటు, మరమ్మతులపై సూచనలు చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు, కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ షఫీఉల్లా, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు పెండింగ్‌లో ఉండొద్దు..

అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి


అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

ఖమ్మం సహకారనగర్: ప్రజలు అందిస్తున్న ప్రతీ ఫిర్యాదును పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో ఆయన వినతిపత్రాలు, ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమావేశమై ఫిర్యాదుల పరిశీలన, పరిష్కారంపై సూచనలు చేశారు. డీఆర్వో పద్మశ్రీ, డీఆర్‌డీఓ సన్యాసయ్య తదితరులు పాల్గొన్నారు.

వలసదారులను పంపించేయాలని వినతి

ఖమ్మం మామిళ్లగూడెం: జిల్లాలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తాన్, బంగ్లాదేశ్ దేశస్తులను గుర్తించి వారి దేశాలకు పంపించాలని బీజేపీ నాయకులు కోరారు. ఈమేరకు అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌కు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తాన్, బంగ్లాదేశ్ దేశాల వలసదారులను వారి దేశాలకు పంపించాలన్న ఆదేశాల మేరకు జిల్లాలో తనిఖీలు చేయాలని కోరారు. నాయకులు సన్నె ఉదయ్‌ప్రతాప్, ఈ.వీ.రమేష్, డాక్టర్ శీలం పాపారావు, గెంటేల విద్యాసాగర్, నున్నా రవికుమార్, మార్తి వీరభద్రప్రసాద్, అల్లిక అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు నకిలీ మావోయిస్టులు అరెస్ట్

గుండాల: మావోయిస్టు పార్టీ పేరుతో వ్యాపారులను బెదిరిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈమేరకు వివరాలను గుండాల పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను వెల్లడించారు. గుండాల ఎస్సై సైదా రవూఫ్, సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తుండగా తూరుబాక వద్ద ఇద్దరు అనుమానాస్పదంగా కనిపించగా అదుపులోకి తీసుకున్నారు. విచారించగా గుండాల మండలం గణాపురానికి చెందిన కల్తిపాపయ్య అలియాస్ సర్పంచ్, ఆళ్లపల్లి మండలం నడిమిగూడెంకు చెందిన పాయం రాజేందర్‌గా తేలింది. వీరు గతంలో ప్రజాప్రతిఘటన దళంలో పని చేయగా, డబ్బు కోసం మావోయిస్టుల పేరుతో గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో వ్యాపారులను డబ్బు కోసం బెదిరిస్తున్నట్లు గుర్తించారు. వీరి నుంచి రూ. 5వేలు, రెండు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసిన సీఐ రవీందర్, ఎస్సై సైదా రహూఫ్, కానిస్టేబుల్ వెంకటేశ్వర్లును డీఎస్పీ అభినందించారు.

హైకోర్టు న్యాయమూర్తి మృతికి సంతాపం


ప్రియదర్శిని చిత్రపటానికి పూలమాల వేస్తున్న న్యాయవాదులు

ఖమ్మం లీగల్: తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి ఎం.జీ.ప్రియదర్శిని మృతిపై ఖమ్మం బార్ అసోసియేషన్ బాధ్యులు సంతాపం ప్రకటించారు. ఈమేరకు సోమవారం బార్ అసోసియేషన్ హాల్‌లో ఆమె చిత్రపటానికి నివాళులర్పించాక అసోసియేషన్ అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావు, తదితరులు మాట్లాడారు. ప్రియదర్శిని మృతి న్యాయ రంగానికి తీరని లోటని, ఆమె ఖమ్మం జిల్లా కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తిగా ఎనలేని సేవలందించారని గుర్తుచేశారు. కాగా, జడ్జి మృతికి మృతికి సంతాపసూచకంగా న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఈకార్యక్రమంలో విజయశాంత, ఇందిర, దిలీప్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, జడ్జి ప్రియదర్శిని మృతిపై న్యాయశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రత్నాకరం శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డితో పాటు ఎస్.కే.నాగుల్ షరీఫ్, జిల్లా కోర్టు నాజర్ కె.శ్యామ్ తదితరులు కూడా సంతాపం తెలిపారు.

వడదెబ్బతో కార్మికుడు మృతి

ఖమ్మంఅర్బన్: ఖమ్మం కైకొండాయిగూడెంకు చెందిన బోల్లపు శ్రీనివాసరెడ్డి (47) వడదెబ్బకు గురై సోమవారం మృతి చెందారు. బల్లెపల్లి వద్ద ఓ ప్రైవేట్ పరిశ్రమలో రోజువారీ కూలిగా పనిచేస్తున్న ఆయన ఎండవేడితో ఇటీవల అపస్మారక స్థితికి చేరాడు. దీంతో సహచర కార్మికులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా, సోమవారం ఉదయం మృతి చెందాడు. ఆయనకు తల్లిదండ్రులు ఉన్నారు. కాగా, మృతుడి కుటుంబానికి ప్రభుత్వం పరిహారం చెల్లించాలని సీపీఎం నాయకుడు దొంగల తిరుపతిరావు డిమాండ్ చేశారు.

రైలు ఢీకొని వృద్ధురాలు..


నన్నేబీ (ఫైల్)

బోనకల్: మండలంలోని గోవిందాపురం(ఏ) గ్రామానికి చెందిన షేక్ నన్నేబీ(75) రైలు ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందింది. ఆమె సోమవారం గ్రామంలోని ట్రాక్ దాటే సమయాన వేగంగా వస్తున్న రైలును గమనించలేదు. దీంతో రైలు ఢీకొనగా అక్కడికక్కడే మృతి చెందింది. నన్నేబీ మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో మార్చురీకి తరలించినట్లు జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

బోనకల్: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మండలంలోని గార్లపాడు వద్ద సీజ్ చేసినట్లుగా ఎస్‌ఐ పొదిలి వెంకన్న తెలిపారు. బ్రాహ్మణపల్లి, మోటమర్రి గ్రామాల్లోని ఇసుక ర్యాంప్‌ల నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను తనిఖీ చేయగా రెండింటికి అనుమతి లేదని తేలినట్లు చెప్పారు. ఈమేరకు వాహనాలను సీజ్ చేసి యజమానులైన మల్లెల వీరభద్రం, గోపిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

వేంసూరు: మండలంలోని కుంచపర్తిలో పేకాట స్థావరంపై పోలీసులు సోమవారం దాడి చేశారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని రూ.9,500 నగదు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఫొటోస్టూడియో దగ్ధం

కారేపల్లి: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కారేపల్లిలోని ఓ ఫొటోస్టూడియో దగ్ధమైంది. కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లోని డాక్టర్ రాఘవులు కాంప్లెక్స్‌లో సూర్యతండాకు చెందిన ధరావత్ రాంచంద్ స్టూడియో నిర్వహిస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి స్టూడియో నుంచి పొగలు వస్తుండడంతో పెట్రోలింగ్ కానిస్టేబుల్ సీతారాములు గమనించి ఫైర్ స్టేషన్‌తో పాటు నిర్వాహకుడికి ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. కాగా, మంటలు ఎగిసిపడుతుండడంతో ఆ ప్రాంతమంతా పొగ కమ్ముకపోవడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ఇంతలోనే అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలు ఆర్పివేశారు. ఈ ఘటనలో స్టూడియోలోని కెమెరాలు, జిరాక్స్ మిషన్, కంప్యూటర్లు పాటు పరీచర్‌కాలిపోవడంతో సుమారు రూ.10లక్షల మేర నష్టం వాటిల్లిందని నిర్వాహకుడు రాంచంద్ వెల్లడించాడు. ఆర్‌ఐ నర్సింహారావు సోమవారం ఉదయం పంచనామా చేయగా, ఘటనపై బాధితుడు రాంచంద్ కారేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.